అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
గురువారం 12 జనవరి 2023

గ్రామాన్ని శుభ్రంగా ఉంచుదాం



డ్రయినేజీ పనులు పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-జుక్కల్

మురికి కాలువల నిర్మాణం చేసి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుదామని జుక్కల్ సర్పంచ్ బొంపెలి రాములు అన్నారు. బుధువారం జుక్కల్ సహకార సొసైటీ చైర్మన్ నాగలగిద్దే శివానంద్ పటేల్‌తో కలిసి సొసైటీ ఎదుట వీధిలో పంచాయతీ నిధులతో నిర్మిస్తున్న మురికి కాలువల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో కొత్త కాలనీలు ఏర్పడుతున్నాయని, శరవేగంగా అభివృద్ధి కొనసాగుతోందని, నూతన కాలనీలలో వెంటనే మురికి కాలువల నిర్మాణాలు చేపడుతున్నట్టు తెలిపారు.

బాలల పరిరక్షణ కమిటీ సమావేశం



పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలో బుధవారం బాలల పరిరక్షణ కమిటీ సమావేశం మండల అధ్యక్షురాలు పట్లోళ్ల జ్యోతి దుర్గారెడ్డి అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో బాల్య వివాహాలు, అక్రమ రవాణా, బాల కార్మికులు వేధింపులు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ పట్లోళ్ళ జ్యోతి దుర్గారెడ్డి, కార్యదర్శి నాగేశ్వర్ ఎంపీడీఓ, ఐసిడిఎస్ అధికారులు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యం.. సంక్షేమానికి కృషి

- ఏ ఒక్కరూ కంటి సమస్యతో బాధపడొద్దనే కంటివెలుగు
- జడ్పీ చైర్‌పర్సన్ శోభ రాజు
- అన్ని ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

కంటి సమస్యలతో ఏ ఒక్కరు బాధపడకూడదనే లక్ష్యంతో ముఖ్య మంత్రి కేసీఆర్ కంటివెలుగు రెండో విడుత కార్యక్రమం చేపడుతున్నట్టు జెడ్పి చైర్పర్సన్ శోభ తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవు తుందని వెల్లడించారు. కామారెడ్డి కలెక్టరేట్లో బుధవారం ప్రజా ప్రతినిధులకు, అధికారులకు కంటి వెలుగు అవగాహన సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా జెడ్పి చైర్ పర్సన్ శోభ మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పేద ప్రజల ఆరోగ్యం వారి సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ప్రజలకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేసి, అవస రమైన కళ్లద్దాలను అందజేస్తారని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ శోభ రాజు, కలెక్టర్ జితేశ్ వి పాటిల్

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడారు. కంటి వెలుగు శిబిరాల నిర్వహణకు క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 44 కంటి వెలుగు స్క్రీనింగ్ బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. 44 మంది వైద్యులు, 44 మంది అప్తాల్మిక్ టెక్నీషియన్లు, 44 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లు సిద్ధం చేశామని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల భాగస్వామ్యంతో జిల్లాలో కంటి వెలుగు రెండో విడత కార్యక్రమం విజయవంతం చేసేలా పగడ్బందీగా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. శిబిరానికి ప్రతిరోజు 300 మంది ప్రజలు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. గ్రామాల వారిగా, మున్సి పాలిటీలో వార్డుల వారీగా షెడ్యూల్డ్ తయారు చేసినట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జెడ్పి సీఈవో సాయ గౌడ్, ఆర్డీవోలు శ్రీనివాస్ రెడ్డి, శీను, రాజా గౌడ్, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీవో ప్రభాకర్ చారి

జీపీ ట్రాక్టర్‌లకు జీపీఎస్

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలు గల ట్రాక్టర్లకు బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ట్రాక్టర్లకు జిపిఎస్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీవో ప్రభాకర్ చారి మాట్లాడుతూ 41 జీపీలకు గాను 40 గ్రామాల్లో ట్రాక్టర్‌లకు జిపిఎస్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. గ్రామపంచాయతీలో పారదర్శక కోసమే జీపిఎస్ విధానం అమలు చేస్తున్నట్టు తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో ఏ పనుల్లో ట్రాక్టర్ పనిచేస్తుందో జీపిఎస్ విధానం ద్వారా మండల స్థాయి అధికారులకు జిల్లా అధికారులకు సంబంధిత కార్యదర్శులకు ఎప్పటికప్పుడు సమాచారం అందుతుందని అన్నారు. సొంత అవసరాలకు ట్రాక్టర్‌లను ఉపయోగిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు అశ్వక్, రాజేందర్, ప్రశాంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో అడ్మిషన్‌ల పోస్టర్ ఆవిష్కరణ



టీజీ యూజీసెట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ప్రిన్సిపాల్స్

నవతెలంగాణ-సదాశివనగర్/మాక్లూర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో టీజీ యూజీసెట్-2023 అడ్మిషన్ పోస్టర్‌లను నిజామాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ బుధవారం వేర్వేరుగా ఆవిష్కరించారు. అడ్మిషన్‌లు ప్రారంభించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేరాలనుకునే విద్యార్థినులు టిజియూజి సెట్- 2023 ఎంట్రన్స్ పరీక్ష రాయాలని, అందుకు వెబ్సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారు, ప్రస్తుతం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ప్రభుత్వం అన్ని వసతులతో ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు పొంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తును అత్యున్నతంగా తీర్చిదిద్దుకోవాలని ఆకాంక్షించారు. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల-నిజామాబాద్ ప్రిన్సిపల్ కే లావణ్య, ఆర్మూర్ ప్రిన్సిపల్ కే గాయత్రి, ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల-నిజామాబాద్ ప్రిన్సిపల్ జైనథ్ వైస్ ప్రిన్సిపల్ వాసవీలత, తెలుగు విభాగం అధిపతి కే రజిత, కామారెడ్డి (మర్కల్) ప్రిన్సిపాల్ డాక్టర్ వి రాధిక తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్ సేవలపై ర్యాలీ

నవతెలంగాణ-భిక్కనూర్



అవగాహన కల్పిస్తున్న అధికారులు

తపాలా శాఖ ఆధ్వర్యంలో అందజేస్తున్న సేవలపై భిక్కనూర్ పట్టణంలో బుధవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్ట్ మాస్టర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ తపాలా శాఖ ఆధ్వర్యంలో " మన తపాలా మన 'సేవలు' పథకంలో భాగంగా సేవింగ్ బ్యాంక్ అకౌంట్, రికరింగ్ డిపాజిట్, సుకన్య సమృద్ధి యోజన, తపాలా జీవిత బీమా, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, గ్రూప్ యాక్సిడెంట్ గార్డు పాలసీ వంటి పథకాలను ప్రజలకు అందుబాటులో ఉన్నాయని, చిన్నారుల వద్ద నుండి వృద్ధుల వరకు ప్రజలకు ఉపయోగపడే పథకాలను తపాలా శాఖా నిర్వహిస్తుందన్నారు. మరిన్ని వివరాల కోసం స్థానికంగా ఉన్న తపాలా కార్యాలయంలో సంప్రదించి తపాలాశాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేల్ ఓవర్ వెంకట్ రాంరెడ్డి, వివిధ గ్రామాల తపాలా శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నువ్వుల విత్తనాలు పంపిణీ



రైతులకు నువ్వుల విత్తనాల బ్యాగ్‌లు అందజేత

నవతెలంగాణ-సదాశివనగర్

మండలం లోని అడ్లూరు ఎల్లారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నందు కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూరు ఆధ్వర్యంలో ఎస్సీ సబ్ ప్లాన్ కింద ఉచిత నువ్వుల విత్తనాలు 11 మంది ఎస్సీ రైతులకు ఒక్కొక్కరికి ఒక ఎకరానికి మూడు కిలోల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ మర్రి సదాశివరెడ్డి మాట్లాడుతూ ఉచితంగా ఇచ్చినటువంటి విత్తనాలను రైతులు విత్తుకొని తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడి పొందాలని కోరారు. ప్రస్తుతం నూనె గింజల సాగు తక్కువ ఖర్చుతో లాభదాయకంగా ఉందని రైతులు కేవలం వరి మాత్రమే కాకుండా నూనె గింజలు కూడా పండించినట్టయితే ఆర్థికంగా లాభపడతారని సూచించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ శాస్త్రవేత్త నవీన్ మాట్లాడుతూ నువ్వులను జనవరి, ఫిబ్రవరి నెలలో విత్తుకున్నట్టయితే ఎటువంటి చీడపీడలకు గురి కాకుండా పంట ఏపుగా పెరిగి సుమారు ఐదు నుంచి ఆరు క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ బక్కన గారి భాస్కర్, వార్డ్ మెంబర్ అశోక్, సొసైటీ సీఈఓ భైరయ్య, ఏఈఓ శ్రీనివాస్ రెడ్డి, రైతులు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ విధానంతో
అంగన్‌వాడీలకు మానసిక క్షోభ

- కార్మికులపై పనిభారం తగ్గించాలి : సీఐటీయూ

నవతెలంగాణ-కంఠేశ్వర్

అంగన్‌వాడీల్లో ఆన్‌లైన్ విధానం రద్దు చేసి బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా విస్తృత సమావేశం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ రమేష్ బాబు, సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్ కు నిధులను తగ్గించటం మూలంగా రాష్ట్ర ప్రభుత్వాలపైన పడే భారం తో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తగ్గించుకోవటానికి వివిధ మార్గాలను అన్వేషిస్తూ కార్మికుల పైన పని భారాన్ని మోపుతున్నదని అన్నారు. కేంద్రాలను ప్రైవేటీకరించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. వీటికి తోడు కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు కొత్త కొత్త యాప్లను ప్రవేశపెడుతూ ఆన్‌లైన్‌లో సమాచారాలను పంపాలని లేనియెడల జీతాలు రావని బెదిరిస్తూ మానసిక వేదనకు గురి చేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. తక్కువ చదువుకున్న చిరుద్యోగులపైన టెక్నాలజీని ప్రయోగించి ఇబ్బందులకు గురి చేయటం మూలంగా మానసిక వేదనతో అనారోగ్యాలకు గురవుతున్నారని అందువల్ల ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐసిడిఎస్ పిడి డిపిఓలతో జరిగిన సమావేశంలో యూనియన్ నాయకులు జరిపిన చర్చలు తమకు ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేయాలని బకాయిలను చెల్లించాలని కనీస వేతనాలు అమలు జరపాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కైరిదేవగంగు, స్వర్ణ, చంద్రకళ, మంగాదేవి, శివరాజమ్మ, జ్యోతి, వాణి, జగదాంబ తదితరులతోపాటు మండల అంగన్వాడి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌బాబు

రూ.10 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

- సీఎం కేసీఆర్ ముందుచూపునకు నిదర్శనం :
- ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ముఖ్యమంత్రి ముందుచూపుతోనే బాధిత కుటుంబానికి 10 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు చేసి ఆదుకోవడం గొప్ప విషయమని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఇందల్ వాయి మండలం చంద్రయాన్ పల్లి గ్రామంలో సుదర్శన్ గౌడ్ నివాసానికి వెళ్లి.. ఇటీవల మరణించిన ఆమె కూతురు రవీన వివరాలు అడిగి తెలుసుకొని వారి కుటుంబానికి సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరు చేయించిన రూ.10 లక్షల చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ రవీన అనారోగ్యంతో ఉన్నప్పుడు 10లక్షల రూపాయల ఎల్‌ఓసి అందజేసినా.. ఆమె మృతిచెందడంతో వినియోగంలోకి రాలేదని, దీంతో సీఎం కేసీఆర్ ముందుచూపుతో రవీనకు పుట్టిన కుమారుడికి కొండంత అండగా ఉండటానికి రూ. పది లక్షల ఆర్థిక సాయం అందజేసినట్టు తెలిపారు. ఇలా నియోజకవర్గంలో ఎన్నో కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి లక్షలాది రూపాయలు మంజూరు చేయిస్తూ బాధిత కుటుంబాలను ఆదుకుంటున్నామనిగర్తు చేశారు. ఇలాంటి సాయం ఏ రాష్ట్రంలోనూ లేదని అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘ సభ్యులు జగన్, ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, మండల అధ్యక్షులు చిలువేరి గంగాదాస్, సర్పంచ్ లలితా గంగాదాస్, తెలు విజయ్ కుమార్, నరేష్, సీనియర్ నాయకులు పాశం కుమార్, అరటి రఘు, ఎంపిటిసి చింతల దాస్, పులి శ్రీనివాస్, పులి సాగర్, డీకొండ సుధీర్, దేవగౌడ్ పాల్గొన్నారు.

వివాహేతర సంబంధంలో
రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ ప్రజాప్రతినిధి భర్త

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని ఓ గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధి భర్త వివాహేతర సంబంధం కేసులో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన ఘటన ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. ఓ గ్రామానికి చెందిన ఎంపీటీసీ భర్త అదే గ్రామానికి చెందిన వివాహితతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో వివాహిత భర్త.. ఇద్దరిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్టు సమాచారం.

దీర్ఘకాలిక, మానసిక సమస్యలకూ
ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేక చికిత్స

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

దీర్ఘకాలిక, ప్రస్తుత మానసిక సమస్యలపై ఎల్లారెడ్డి కమ్యూనిటీ ఆస్పత్రిలో ప్రత్యేక చికిత్స అందించనున్నట్టు మానసిక ఆరోగ్య వైద్య నిపుణులు డా. జి రమణ తెలిపారు. ఎల్లారెడ్డి కమ్యూనిటీ ఆసుపత్రిలో మత్తమాల్, లింగంపేట్, నాగిరెడ్డిపేట్ పీహెచ్‌సీల పరిధిలో మానసిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వ్యక్తులకు, ప్రస్తుతం రకరకాల మానసిక వ్యాధులకు గురవుతున్న వారికి బుధవారం చికిత్స అందించడంతో పాటు అవగాహన కల్పించినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రవీంద్ర మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా డా. జి రమణ మాట్లాడుతూ చాలామంది వ్యక్తులు దీర్ఘకాలిక మానసిక సమస్యలతో పాటు మనోవైకల్యం, ఫిట్స్, ద్విధ్రువ ప్రభావిత రుగ్మత, నిరాశ,నిస్పృహ, ఆత్మహత్య ప్రేరేపిత ఆలోచనలు, నరాల బలహీనత, మతిమరుపు, నిద్రలేమి, అధిక ఒత్తిడి బాధిత సమస్యలతో బాధపడుతున్న వారికి, ఆల్కహాల్, మాధకద్రవ్యాల, మత్తుపదార్థాలు గంజాయి వంటివి మాన్పించుట కోసం ప్రత్యేక చికిత్స కమ్యూనిటీఆరోగ్య కేంద్రాల్లో, ఏరియా ఆస్పత్రుల్లో, జిల్లా ఆస్పత్రుల్లో అందజేస్తున్నట్టు తెలిపారు. అదేవిధంగా నేషనల్ మెంటల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా అన్ని రకాల మానసిక సమస్యలకు వైద్య సదుపాయలున్నాయని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలకు రానివారు నేరుగా టెలీ మానస్ టోల్ ఫ్రీ నెంబర్ 14416ని కూడా సంప్రదించి వైద్య సదుపాయం, కౌన్సెలింగ్ తీసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మెంటల్ హెల్త్ ప్రోగ్రాం సోషల్ వర్కర్ డా.రాహుల్ కుమార్,హెల్త్ సూపర్ వైజర్ లు మధుసుధన్, వెంకట్ నారాయణ, ఫార్మసిస్ట్ శేషగిరి రావ్, స్టాఫ్ నర్స్ తిరుమల మరియు సిబ్బంది బాలకిషన్ పాల్గొన్నారు.



పేషెంట్‌లకు చికిత్స చేస్తున్న వైద్యులు

మనువాదుల ఆటలు సాగనివ్వం

- తెలంగాణ.. ఉద్యమాల గడ్డ
- మను ధర్మానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాడి.. టీచర్ మల్లికార్జునకు అండగా ఉంటాం
- దాడిచేసిన వారిని 24 గంటల్లోగా అరెస్ట్ చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు
- చలో కోటగిరికి తరలిన వామపక్ష, బహుజన, విద్యార్థి సంఘాల నాయకులు

వివరాలు మెయిన్‌లో..



కోటగిరిలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నాయకుల నినాదాలు

గుంట భూమీ వదలపెట్టబోం

- మాస్టర్‌ప్లాన్ రద్దు చేయకుంటే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం
- కామారెడ్డి మున్సిపల్ ఎదుట రైతుల ధర్నా
- మా భూములు పోతున్నాయని ఆందోళనలు చేస్తుంటే పెయిడ్ వర్కర్లమా..?
- మండిపడ్డ రైతులు
- తెల్లవారు జామునుంచే ముందస్తు అరెస్టులు

వివరాలు మెయిన్‌లో..



మున్సిపల్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా



ముందస్తుగా రైతులను అదుపులోకి తీసకుంటున్న పోలీసులు

పతంగులు ఎగురవేసేటప్పుడు జాగ్రత్త



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

సంక్రాతి పండుగ సందర్భంగా పతంగులు ఎగురవేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ గణేశ్ సూచించారు. ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా పండగలను ఆనందోత్సవాల మధ్య నిర్వహించుకోవాలని, పండుగకు ఊరికి వెళ్తే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిషేధిత చైనా మాంజా అమ్మితే కేసులు నమోదు చేస్తామని ఎవరైనా అమ్మితే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గాలి పటాలు ఎగురవేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఓపెన్ స్లాబ్ బిల్డింగ్‌లపై గాలి పాటలు ఎగిరివేయకపోవడమే మంచిదని సూచించారు. కరెంట్ వైర్‌లు గల ప్రదేశాలలో గాలి పటాలు ఎగుర వేయొద్దని గాలి పటాలు ఎగిరివేసేటపుడు పిల్లలతో పెద్దవారు తప్పకుండా ఉండాలి అన్నారు. పండగకి వేరే ఊళ్లకి వెళ్ళే ప్రజలు పక్క ఇంటి వాళ్ళు ను గమనించాలని సూచించాలని, పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

లాల్‌బహదూర్ శాస్త్రీకి నివాళి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

దేశ మాజీ ప్రధాని, భారతరత్న లాల్ బహదూర్ శాస్త్రీ వర్ధంతి పురస్కరించుకొని బీజేపీ నాయకులు బుధవారం మండల కేంద్రంలో నివాళి అర్పించారు. దేశం కోసం జై జవాన్ - జై కిసాన్ నినాద సృష్టికర్త లాల్ బహదూర్ శాస్త్రి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బాలకిషన్ , మండల బీజేపీ ఉపాధ్యక్షులు మ్యాతరి సాయిలు, ప్రధాన కార్యదర్శి కురుమ సాయిబాబా, సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు నరేష్, తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యం చాటిన ముస్లిం


అయ్యప్ప స్వాములతో షరీఫ్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్‌కు చెందిన షరీఫ్ అనే ముస్లిం వ్యక్తి గత రెండు సంవత్సరాలుగా అయ్యప్ప మాలదారులకు అల్పాహారం అందిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం అయ్యప్ప మాలదారులకు తన సొంత ఖర్చులతో అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలదారులు పిల్లి ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని అర్గుల్ గ్రామంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఆరేటి లక్ష్మీనారాయణ(60) అనే వృద్ధుడు మృతి చెందాడు. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌లోని అర్సపల్లికి చెందిన లక్ష్మీనారాయణ మంగళవారం ఉదయం తన బావమరిది ఇంటికి పడకల్ గ్రామానికి వచ్చాడు. పడకల్‌లో తన బావమరిది ఇంట్లో రాత్రి భోజనం చేసిన తర్వాత నిజామాబాద్‌కు వెళ్తానని చెప్పి నడుచుకుంటూ బయలుదేరి వెళుతున్నాడు. ఈ క్రమంలో అర్గుల్ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ఆరేటి లక్ష్మీనారాయణ మేనల్లుడు అయిన నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దృష్టి లోపం దూరం చేసేందుకు

కంటి వెలుగు


కంటివెలుగు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు, తదితరులు

- సమిష్టి కృషితో విజయవంతం చేద్దాం
- జిల్లాస్థాయి అవగాహనా సదస్సులో ప్రజాప్రతినిధులు, అధికారుల పిలుపు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

దృష్టి లోపాలను దూరం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ నెల 18 నుంచి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సమిష్టి కృషితో విజయవంతం చేద్దామని ప్రజాప్రతినిధులు, అధికారులు పిలుపునిచ్చారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో బుధవారం జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి నేతృత్వంలో కంటి వెలుగు కార్యక్రమంపై జిల్లాస్థాయి అవగాహనా సదస్సును నిర్వహించారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, ఎమ్మెల్సీ రాజేశ్వర్, మున్సిపల్ చైర్‌పర్సన్లు తూము పద్మ, వినీత పండిత్, కన్నెగంటి ప్రేమలత, జెడ్పీ వైస్ చైర్మన్ రజిత యాదవ్, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. దేశంలోనే మరెక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్రంలో వినూత్న ఆలోచనలతో ఎన్నో బృహత్తర కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖ, సంతోషాలతో ఉన్నప్పుడే బంగారు తెలంగాణ లక్ష్యం నెరవేరుతుందనే ప్రగాఢ విశ్వాసంతో అన్ని కులాలు, అన్ని మతాల వారి కోసం విస్తృత స్థాయిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణ స్వావలంబన సాధించాలనే గొప్ప లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం దార్శనికతతో ఇక్కడ అమలు చేస్తున్న కార్యక్రమాలు యావత్ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, ఇతర రాష్ట్రాలకు చెందిన వారు తెలంగాణ పాలనను కొనియాడుతున్నారని వారు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. కంటి వెలుగు ప్రాధాన్యతను గుర్తిస్తూ, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయాలని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కంటి వెలుగు ముఖ్య ఉద్దేశ్యం గురించి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన ఆవశ్యకత గురించి కలెక్టర్ నారాయణరెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో 18 సంవత్సరాలు పైబడిన 12,32,872 మందికి ఈ కార్యక్రమం ద్వారా నేత్ర పరీక్షలు నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులలో కంటి వెలుగు శిబిరాలను నిర్వహించేందుకు వీలుగా 70 బృందాలను ఏర్పాటు చేశామని, ఒక్కో బృందంలో ఎనిమిది మంది సభ్యులు ఉంటారని, కంటి పరీక్షలు జరిపి అవసరమైన వారికి అప్పటికప్పుడు ఈ శిబిరాల్లోనే మందులు, కంటి అద్దాలు అందిస్తారని అన్నారు. ఇప్పటికే జిల్లాకు 61,200 అద్దాలు చేరుకున్నాయని వివరించారు. ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ అవసరమైన వారి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చడం జరుగుతుందని, పక్షం రోజుల్లోపు వారికి కంటి అద్దాలు సమకూరుస్తామని తెలిపారు. శరీర అవయవాలలో అతి ముఖ్యమైనవి నేత్రాలే అయినందున కంటి సమస్యలను ఎంతమాత్రం నిర్లక్ష్యం చేయకుండా పద్దెనిమిదేళ్లు పైబడిన వారందరూ తప్పనిసరిగా కంటి వెలుగు శిబిరాల్లో నేత్ర పరీక్షలు జరిపించుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. ఈ దిశగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ అందుబాటులో ఉన్న అన్ని మార్గాల్లోనూ విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ కోరారు. ముఖ్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో సమిష్టిగా కృషి చేస్తూ జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు చెందిన అధికారులు, సిబ్బంది శిబిరాల నిర్వహణలో కీలకపాత్ర పోషించాలన్నారు. శిబిరాలకు అవసరమైన కుర్చీలు, టేబుళ్లు, షామియానాలు, తాగునీరు, పారిశుధ్యం వంటి వాటి ఏర్పాటుకు స్థానిక ప్రజాప్రతినిధులు సైతం తోడ్పాటును అందించాలని, వైద్య బృందాలు వారికి కేటాయించిన కార్యస్థానాల్లో స్థానికంగా బస చేసేందుకు వీలుగా సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. ఆయా గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా రూపొందించిన నిర్దిష్ట ప్రణాళికను అనుసరిస్తూ కంటివెలుగు శిబిరాలకు క్రమ పద్ధతిలో ప్రజలను తరలించేలా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కంటి వెలుగు శిబిరాల నిర్వహణపై పరిపూర్ణ అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన డెమో ప్రదర్శనను ప్రజాప్రతినిధులు తిలకించారు. కంటి వెలుగు బ్రోచర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. అవగాహన సదస్సులో నోడల్ అధికారి అమర్‌సింగ్ నాయక్, అదనపు కలెక్టర్లు బి.చంద్రశేఖర్, చిత్రామిశ్రా, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సుదర్శనం, వివిధ శాఖల అధికారులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా కళాకారుల ప్రతిభ


జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన అభ్యర్థులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్రస్థాయి యువజనోత్సవ పోటీలలో జిల్లా కళాకారుల ప్రతిభ చాటారని జిల్లా యువజన, క్రీడల అధికారి జె.ముత్తెన్న బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26వ జాతీయ యువజనోత్సవాల సందర్భంగా జిల్లా స్థాయి యువజనోత్సవం ఈనెల 4న నగరంలోని న్యూ అంబేద్కర్ భవనంలో నిర్వహించగా.. జానపద నృత్యం, జానపద గేయం పోటీలలో గెలుపొందిన కళాకారులు, నాన్ కాంపిటేషన్ ఈవెంట్స్ ఉపన్యాస, కబడ్డీలో ఎంపికైన వారికి రాష్ట్ర స్థాయి యువజనోత్సవ పోటీలు ఈనెల 9, 10న హైదరాబాద్‌లోని శిల్పారామం నందు నిర్వహించారని తెలిపారు. కాగా రాష్ట్రస్థాయి యువజనోత్సవ పోటీలలో జానపద గేయములో గీతాంజలి గ్రూప్ మొదటి బహుమతి గెలుపొందారని వివరించారు. రాష్ట్రస్థాయిలో గెలుపొందిన వారికి అభినందనలు తెలియజేస్తూ జాతీయస్థాయిలో గెలుపొందాలని అన్నారు. ఈనెల 12 నుంచి 16 వరకు కర్ణాటకలోని హుబ్లిలో జాతీయ స్థాయి యువజనోత్సవ పోటీలలో మన తెలంగాణ వారు నాన్ కాంపిటేషన్ ఈవెంట్స్ అయిన ఉపాన్యసం నందు తన్వి ఎ.చందరన, కబడ్డీలో ఎం.ప్రియాంక ఎంపికయ్యారని, వీరు జాతీయ స్థాయి యువజనోత్సవ పోటీలలో మన తెలంగాణ తరపున పాల్గొంటారని అన్నారు. జాతీయ స్థాయిలో రాణించి అక్కడ మొదటి బహుమతి పొందాలని ఆకాంక్షించారు.

యశో బుద్ధ ఫౌండేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో డా.బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో యశో బుద్ధ ఫౌండేషన్ ఆర్మూర్ వారి నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. స్థానిక ఎంపీటీసీ సభ్యుడు మైలారం సుధాకర్ చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. బుద్ధుని ఆలోచనలు, ఆచరణలు విశ్వవ్యాప్తం అయినప్పటికీ ఇంకా పూర్తి స్థాయిలో బుద్ధుని ఆచరణ నియమాలు అనుసరించడంలో అమలు కావాలన్నారు. క్యాలెండర్‌పై బుద్ధుని బోధన అంశాలు, అంబేద్కర్ ఆలోచన విధాన అంశాలు ముద్రించడం జరిగిందని తెలిపారు. యశో బుద్ధ ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశం తత్వగథ, బుద్ధుడి బోధనలు, ఆచరణలు గ్రామస్థాయిలో కూడా అమలు కావాలని గుర్తు చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు సుంకరి విజయ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు పాలేపు నర్సయ్య ప్రధాన కార్యదర్శి సింగరి రాజేశ్వర్, కన్వీనర్ నిమ్మ ప్రసాద్, సభ్యులు గుర్రం నరేశ్, లెక్చరర్ సాయన్న, వినయ్, సునీల్, ఆంజనేయులు, కృష్ణ మూర్తి, ప్రభు, అజయ్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీల నియామకం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని బ్రాహ్మణపల్లి, తొర్లికొండ గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీలను నియమించినట్టు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పాట్వారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని దూస్‌గాం గ్రామానికి చెందిన డిచ్‌పల్లి మండలం బీజేపీ కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి ఎర్ర సిద్దు నరేష్ బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ, మండల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజీరెడ్డి గోవర్ధన్ ఆధ్వర్యంలో బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, శ్రీనివాస్ రెడ్డి, రైతు సమితి అధ్యక్షుడు నారాయణరెడ్డి తదితరులున్నారు.

వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

నవతెలంగాణ-ఆర్మూర్

నేటి యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని విజయాలను సాధించాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, సీనియర్ సివిల్ జడ్జ్ పద్మావతి పిలుపునిచ్చారు. బుధవారం ఇందూర్ యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 161వ జయంతి వేడుకలను పట్టణంలోని క్షత్రియ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి ముఖ్య అతిథిగా హాజరవగా.. జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ నాగరాజు, క్షత్రియ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్, కళాశాల ప్రిన్సిపాల్ డా.ఆర్కె పాండే, వైస్ చైర్మన్ అల్జాపూర్ లక్ష్మి నారాయణ, ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, దారం గంగాధర్ పాల్గొని ముందుగా వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు యువతను అలరించాయి. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు రామేశ్వర్‌రెడ్డి, సంజీవ్ రావ్, సూజాత రెడ్డి, పుష్పవతి, కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

దాడి చేసిన గుండాలను అరెస్టు చేయండి

- డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు కమలాపురం రాజన్న


మాట్లాడుతున్న రాజన్న

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కోటగిరిలో ఉపాధ్యాయునిపై దాడి చేసిన గుండాలను వెంటనే అరెస్టు చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు కమలాపురం రాజన్న అన్నారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ కోటగిరి మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో బీజేపీ, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ బజరంగ్‌దళ్, కార్యకర్తలు, ఉపాధ్యాయుడు, మల్లికార్జున్‌పై దాడి చేసి స్కూల్ నుంచి హనుమాన్ మందిర్ వరకు భయభ్రాంతులకు, గురి చేస్తూ తీసుకెళ్లి అక్కడ తన భావప్రకటన స్వేచ్ఛను హరిస్తూ జై శ్రీరామ్ అనాలని అన్నారని, బలవంతంగా బొట్టు పెట్టి తనను పోలీసుల సమక్షంలోనే చంపుతామని బెదిరించి పాఠాలు చెప్పవద్దని దాడి చేశారని తెలిపారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. చోద్యం చూసిన ఎస్సై, ఈ ఘటనపై స్పందించని హెచ్ఎం, ఎంఈఓ, డీఈఓను విధుల నుంచి బహిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయునిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయకపోవడం, కౌంటర్ కేసుపెట్టడం పోలీసులు, ఎస్సీ ఎస్టీ చట్టాలను నీరుగార్చడానికి ప్రజాప్రతినిధుల కనుసన్నలలో మెలుగుతున్న పోలీసులు అని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కంజర భూమయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కమలాపురం రాజన్న, పి.ముత్యాలు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, రాజారెడ్డి, జిల్లా కార్యదర్శి, అడ్డికే రాజేశ్వర్, మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎంఏ.రఫీ ఖాన్, యువజన సంఘం జిల్లా కార్యదర్శి పి.రంజిత్ కుమార్, హమాలీ యూనియన్ నాయకులు, ఎం.ముల్తాన్, పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీ పరీక్షలో చాయిస్ ప్రశ్నలు పెంచి..

పరీక్షల నిర్వహణలో మార్పులు చేయాలి

- ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎస్ఎస్‌సీ పరీక్షలో చాయిస్ ప్రశ్నలు పెంచి, పరీక్షల నిర్వహణలో మార్పులు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ నెలలో జరుగనున్న పదవతరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ మార్పులు చేయాలని ఏడీ నాగజ్యోతికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ నగర కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పదవ పరీక్షలలో మొదటిసారిగా పబ్లిక్ పరిక్షలు రాస్తున్న విద్యార్థులను మానసిక ఒత్తిడిని దూరం చేసే విధంగా టెస్ట్ క్వశ్చన్ పేపర్లలో 30శాతం చాయిస్ ప్రశ్నలు పెంచాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తుందన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రానున్న పదవ తరగతి పరీక్షలలో పేపర్లను కుదించి 6పేపర్లు చేయడం ఆహ్వానించదగ్గ విషయమని, కానీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలు 2 మార్కుల 3 మార్కుల ప్రశ్నలకు ఎలాంటి ఛాయిస్ ఇవ్వలేదన్నారు. వ్యాసరూప ప్రశ్నలలో కూడా సెక్షన్లను పెట్టకుండా ఇచ్చిన సమయంలో అన్ని రాయాలని పెట్టడం వలన సిలబస్ మొత్తం ఒకే పేపర్‌లో విద్యార్థులు రాయాలంటే సమయం సరిపోక అయోమయంలో పడి పరీక్ష అంటే కఠినంగా ఉంటుందని ఒత్తిడికి లోనైతే పరీక్షలు ఏ విధంగా రాస్తారో ప్రభుత్వానికే తెలియాలని అన్నారు. అదే విధంగా పరీక్షలు రాస్తున్న విద్యార్థులంతా కరోనా సమయంలో ఆన్‌లైన్‌లో సరిగ్గా డిజిటల్ విద్య అందుబాటులో లేని సమయంలో చదువుకోవడం మూలంగా సరైన అభ్యాసన లేని వారు ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న కనీసం ఈ పరిస్థితి దృష్ట్యా కనీసం ఛాయిస్ లేకుండా చేస్తే విద్యార్థులు నష్ట పోతారని తెలిపారు. ఉన్నత విద్యలో ఛాయిస్ ఉందని, కానీ పాఠశాల విద్యలో లేకపోవడం విడ్డూరమని అన్నారు. కార్యక్రమంలో నగర నాయకులు శివ, శ్రీహరి, రాజ్‌కుమార్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా సిరికొండ సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఎంపీపీ

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సాధారణ స్థాయి సర్వసభ్య సమావేశం రసాభసాగా సాగింది. ఎంపీపీ సంగీత రాజేందర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముందుగా అన్ని శాఖల మండల స్థాయి అధికారులు వారి అభివృద్ధి కార్యక్రమాలను, చేపట్టిన పనులను, పూర్తయినవి, అసంపూర్తిగా ఉన్నవి నివేదికలను వివరించారు. ముందుగా విద్యుత్ శాఖ ఏఈని సిరికొండ, కొండాపూర్, కొండూరు, హుస్సేన్‌నగర్ గ్రామాల సర్పంచులు తమ గ్రామాలలో నెలకొన్న విద్యుత్ సమస్యల పైన వివరణ కోరారు. గత రెండు సర్వసభ్య సమావేశాలలో తీర్మానించిన విషయాలను, పనులను ఇప్పటివరకు పూర్తి ఎందుకు చేయలేదని నిలదీశారు. అదేవిధంగా పశు వైద్య శాఖ అధికారి సమావేశానికి రాకుండా సిబ్బందిని పంపడంతో తమకు కావలసిన సమాచారాన్ని ఇవ్వకుండా తప్పించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నాడని ఆయన పైన చర్యలు తీసుకోవాలని ఎంపీపీకి విన్నవించారు. అదేవిధంగా మిషన్ భగీరథ ఏఈని సమస్యల పట్ల స్పందించడం లేదని నిలదీశారు. గ్రామాలలో అధికారులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీపీ హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తోట రాజన్న ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, తహసీల్దార్ గఫ్ఫార్ మియా, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ కమ్మర్‌పల్లి చైర్మన్ గిరేందర్‌రెడ్డి, ఏఈలు, ఎంపీటీసీలు, సర్పంచులు, స్థానిక సొసైటీ చైర్మన్ మైలారం గంగారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు పెన్షనర్ల సమస్యలపై పెన్షన్ అదాలత్

నవతెలంగాణ-కంఠేశ్వర్

పెన్షనర్ల సమస్యలపై పెన్షన్ అదాలత్‌ను గురువారం నిర్వహించనున్నట్టు రీజినల్ పీఎఫ్ కమిషనర్ హనుమంతప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదుదారులు వెబ్‌సైట్‌లో మీటింగ్ నెంబర్ 2644 040 2210, పాస్‌వర్డ్ enf 1234 Webex ఎంటర్ చేసి కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని సూచించారు.

13న నగర మహిళలకు ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగర మహిళలకు సంక్రాంతి పండుగ సందర్భంగా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్, నిజామాబాద్ అర్బన్ కార్పొరేటర్ల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను శుక్రవారం ఉదయం 9గంటల నుంచి కలెక్టర్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్టు నిజామాబాద్ నగర పాలక సంస్థ మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ముగ్గుల పోటీలలో పాల్గొనే మహిళలు చుక్కల ముగ్గులను మాత్రమే పరిగణలోకి తీసుకోబడుతుందని తెలిపారు.

డయాలసిస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని 100 పడకల ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కృషితో డయాలసిస్ పూర్తి స్థాయి సేవలు ప్రారంభించినట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగరాజు బుధవారం తెలిపారు. ఇంతకుముందు ఎవరైతే నిజామాబాద్, నిర్మల్ ప్రాంతాలలో డయాలసిస్ చేయించుకున్నవాళ్లు అక్కడినుంచి ఆబ్జెక్షన్ పత్రం తీసుకువస్తే ఏరియా ఆసుపత్రి యందు డయాలసిస్ సేవలు పొందవచ్చునని అన్నారు. కిడ్నీ సంబంధిత రోగులు డయాలసిస్ సేవలను వినియోగించుకోవాల్సిందిగా సూచించారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఎడపల్లి

ఈనెల 18న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేస్తుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వర్ని, మోస్రా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం మోస్రా పీహెచ్‌సీ పరిధిలోని వర్ని మండలం కూనిపూర్ గ్రామంలో పాఠశాల బాల బాలికలచే కంటి వెలుగుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కంటి చూపుతో ఇబ్బందులు పడుతున్న ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలను నిర్వహించుకొని ఉచితంగా అద్దాలను పొందాలని ఆయన కోరారు. స్థానిక సర్పంచ్ శశికళ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ మురళి, వైద్య సిబ్బందితోపాటు ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా ఆర్చరి ట్రైనింగ్ సెంటర్ ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రతీకార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని రాజారాం స్టేడియం, నాగారాంలో ఖేలో ఇండియా ఆర్చరి ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించినట్టు జిల్లా యువజన, క్రీడల అధికారి జె.ముత్తెన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసక్తి గల ఆర్చరి క్రీడాకారులు ఈ సదావకాశమును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు ఆర్చరి కోచ్ ఎం.మురళిని 9848919480 ఫోన్‌నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని బాబాపూర్ గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఎస్ఐ రాజ్‌భరత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బాబాపూర్ గ్రామానికి చెందిన అలీమొద్దీన్ సోమవారం సాయంత్రం తన ఇంటికి తాళం వేసి నిజామాబాద్ ఫంక్షన్‌కు వెళ్లాడు. బుధవారం ఉదయం వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి పరిశీలించగా 5తులాల బంగారం, కొంత నగదును గుర్తుతెలియని దుండగులు దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముందస్తు అరెస్టులను ఖండించాలి

నవతెలంగాణ-ఆర్మూర్

ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్తగూడెం వస్తున్న సందర్భంగా బుధవారం న్యూడెమోక్రసీ పార్టీ రాష్ట్ర నాయకుడు కామ్రేడ్ ఆవునూరి మధును ముందుగానే అరెస్ట్ చేయడాన్ని సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు తీవ్రంగా ఖండించారు. బుధవారం పట్టణంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. ఈ అప్రజాస్వామిక నిరంకుశ విధానాలను వ్యతిరేకించాలని, అలాగే అరెస్ట్ చేసిన కామ్రేడ్ మధుని బేషరతుగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతుల, కార్మికుల, విద్యార్థుల, యువజన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యతను ఎత్తిచూపి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆందోళన చేస్తే అక్రమ అరెస్టులు చేయడం ప్రజాస్వామిక విలువల్ని పాతర వేయడమే అవుతుందని ఆయన అన్నారు. సమావేశంలో సబ్ డివిజన్ కమిటీ కార్యదర్శి బి.సూర్యశివాజీ, ప్రజా సంఘాల నాయకులు ఎస్.రవి, సురేష్‌బాబు, సుంకరి శ్రీనివాస్, ఎస్.వెంకటేష్, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తాళ్లరాంపూర్ గ్రామానికి చెందిన ఉట్నూర్ గంగాధర్ గత కొంతకాలంగా పేరాలసిస్ వ్యాధితో బాధపడుతూ.. చికిత్స చేయించుకునే స్తోమత లేకపోవడంతో విషయాన్ని తెలుసుకున్న ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి బాధిత కుటుంబానికి రూ.5వేలను పంపగా ఆ నగదును సునీల్ యువసేన సభ్యులు కుటుంబానికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సునీల్ యువసేన సభ్యుడు బెజ్జారాం భాను తదితరులు పాల్గొన్నారు.

తపాల బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


పోస్టల్ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తపాల బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, తపాలా శాఖలో ప్రజలకు ఉపయోగపడే పలు పథకాలు ఎక్కువ వడ్డీని అందిస్తున్నాయని నిజామాబాద్ సౌత్ సబ్ డివిజన్ ఐపీఓ సంతోష్ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం ఇందల్‌వాయి సబ్ పోస్టాఫీస్ ద్వారా అందిస్తున్న పథకాలను ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సుకన్య సమృద్ధి యోజన, రికరింగ్ డిపాజిట్ పథకం, సేవింగ్స్ పథకం, గ్రామీణ తపాలా బీమా, తదితర పథకాలు, ఖాతాలపై ప్రజలకు క్లుప్తంగా వివరించారు. తపాలా శాఖలో ప్రజలకు ఉపయోగపడే పలు పథకాలు ఎక్కువ వడ్డీ రేటును అందిస్తున్నాయని తెలిపారు.

రోడ్డు సేఫ్టీపై అవగాహన



నవతెలంగాణ-ఆర్మూర్

జాతీయ రహదారుల భద్రత వారోత్సవాల సందర్భంగా లయన్స్ క్లబ్ అఫ్ నవనాథపురం, శ్రీ చైతన్య పాఠశాల ఆధ్వర్యంలో రోడ్డు భద్రత, డ్రంక్ అండ్ డ్రైవ్ అవగాహనా ర్యాలీని బుధవారం నిర్వహించారు. ప్రోగ్రాం చైర్మన్ మోహన్ దాస్ మాట్లాడుతూ.. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా ప్రజలకు రోడ్డు సేఫ్టీ జాగ్రత్తలు, మద్యం సేవించి వాహనాలు నడిపించవద్దని అవగాహన కల్పించినట్టు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ చెన్న రవికుమార్, కోశాధికారి లయన్ ద్యాగ ఉదయ్ కుమార్, ప్రోగ్రాం చైర్మన్ లయన్ మోహన్ దాస్, చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ ముత్తు, సేవకురాలు చెన్న తరంగిణి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. మిస్సింగ్ కేసు నమోదు

నవతెలంగాణ-భిక్కనూర్



భిక్కనూర్ పట్టణంలో వ్యక్తి అదృశ్యమైన ఘటన బుధవారం వెలుగుజూసింది. పోలీసులు తెలిపిన వివరణ ప్రకారం భిక్కనూర్ పట్టణానికి చెందిన బీరయ్య (43) ఈనెల 9 వ తేదీ నాడు బయటకు వెళ్ళివస్తానని చెప్పి రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో బంధువుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు.

ఎమ్మెల్యే షిండే పూజలు



విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే షిండే

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని నాగల్‌గావ్ గ్రామంలో బుధవారం పోచమ్మతల్లి విగ్రహప్రతిష్టాపన కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెలే హన్మంత్ షిండే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ కపిల్ పటేల్ అధ్యక్షతన గ్రామస్తులు నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅథితిగా ఎమ్మెలే హన్మంత్ షిండే పాల్గొన్నారు. అంతకు ముందు గ్రామస్తులు మహిళలు బోనాలు ఊరేగింపుగా తీసుకొచ్చారు. పోతరాజుల విన్యాసాలు, పూనకాలు, నృత్యభంగీమలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు చేపట్టారు.అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయాగౌడ్, మాజీ ఎంపిపి బస్వంత్ పటేల్, మాజీ సర్పంచ్ మారుతీ, అనీల్ కూమార్, సీనీయర్ నాయకులు బాబు పటేల్, బాలాజీ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

వరిలో తడి పొడి విధానంపై అవగాహన

నవతెలంగాణ-రాజంపేట్/గాంధారి/లింగంపేట్



అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

పద్మపాని సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్స్ వారి సహకా రంతో మండ లంలోని అన్నారం గ్రామంలో బుధవారం గ్రామ పంచాయతీ కార్యా లయం అవరణలో గ్రామ రైతులతో వరిలో తడి పొడి విధానంపై అవగాహన కల్పించారు. సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ అమృతరాజేందర్ రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. వరిలో అధిక దిగుబడి వచ్చేలా తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు వరిలో తడి మరియు పొడి సాగు విధానం పై పూర్తిగా అవగాహన కలిగి ఉండి సమస్యలు ఎదురైతే సంస్థ ప్రతినిధులను సంప్రదించి దిగుబడి పెరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులందరూ ఈ పద్ధతి పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శిల్ప, సంస్థ సెక్రెటరీ రాంనివస్, పద్మపాని స్వచ్ఛంధ సంస్థ మండల కోఆర్డినేటర్ కొప్పుల రవి గ్రామ పంచాయతీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వరిలో ఉల్లికోడ్, కాండం తొలుచు పురుగు నివారణపై అవగాహన

గాంధారి : వరిలో ఉల్లికోడు మరియు కాండం తొలుచు పురుగు నివారణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నరేష్ రైతులకు సూచించారు. గాంధారి మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామపరిధిలోనీ వరి పంటను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నివారణ చర్యలు వివరించారు. కార్యక్రమంలో రైతులు బాలయ్య, పోచయ్య, ఏఈఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యాసంగి పంటల నమోదు

లింగంపేట్ : లింగంపేట మండలంలోనిఎక్కపల్లి మరియు శెట్టిపల్లి సంగారెడ్డి గ్రామాలలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రశాంత్ కుమార్ యాసంగి పంటల నమోదు ను బుధవారం క్షేత్రస్థాయిలో సర్వే నెంబర్ వారిగా పంటల నమోదు చేశారు. ఈ పంటల వివరాలను వ్యవసాయ శాఖ పోర్టల్ నందు నమోదు చేయడం జరిగిందని వ్యవసాయ విస్తీర్ణ అధికారి ప్రశాంత్ కుమార్తె తెలిపారు.

స్నేహ భావాన్ని పెంపొందించుకోవాలి

నవతెలంగాణ-రామారెడ్డి




క్రీడాకారులతో ఎస్ఐ

స్నేహ భావాన్ని పెంపొందించుకోవడానికి ఆటలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎస్సై అనిల్ అన్నారు. వివేకానంద జయంతి పురస్కరిం చుకొని నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ పోటీలలో గెలుపొందిన జట్లకు బుధవారం బహుమతులు అందజేసి, అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గెలుపోటములు సహజమేనని, గెలిచినవారు మరింత మెలుకువలు తెలుసుకొని భవిష్యత్తులో మరిన్ని విజయాలను పొందాలని, ఓటమి చెందినవారు, తప్పిదాలను అధిగమించి భవిష్యత్తులో గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. మొదటి బహుమతి రెడ్డి పెట్, రెండవ బహుమతి రెడ్డి పేట స్కూల్ తండా క్రీడాకారులు అందుకున్నారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందూరి బాలమణి లింబాద్రి, ఎస్సై రవీందర్, పోలీస్ సిబ్బంది, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సంఘాలను బలోపేతం చేయాలి

డీపీఎమ్ ఐబీ సుధాకర్

నవతెలంగాణ-జుక్కల్



మాట్లాడుతున్న సుధాకర్

గ్రామ సంఘా లను బలోపేతం చేయాలని ఐకేపీ డీపీఎమ్ ఐబీ సుధాకర్ సూచించారు. ఈ సంధర్భంగా ఐకేపీ ఏపీఎమ్ సత్యనా రాయణ అధ్యక్షతన స్త్రీశక్తీ భవనంలో మండలంలోని సిసిలు, వీవోలతో బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతు బ్యాంకింగ్, స్త్రీ నిధి రుణాలను వందశాతం లక్ష్యలను చేరుకోవాలని అన్నారు. స్వయం సేవక సంఘాల ద్వారా పోదుపు లెక్కలను రోజుల వారిగా ఎప్పడికప్పుడు యాప్ ద్వారా స్మార్ట్ ఫోన్ ద్వారా ఎంట్రీ చేయాలని సూచించారు. గ్రామాలలో మిగిలి ఉన్న అర్హులైన మహిళలను కొత్త గ్రూప్‌లలో చేర్పించి కొత్త గ్రూపులు తయారు చేయాలని తెలిపారు. యాభై ఎనమిది - ఎనభై మధ్యగా ఉన్న వయస్సు వారికి వృద్ధ సంఘాలను ఏర్పాటు చేయాలని చెప్పారు.

సర్పంచ్ రక్తదానం

నవతెలంగాణ-రెంజల్

నవీపేట్ మండలం పొతంగల్ గ్రామానికి చెందిన వివాహిత మౌనికకు అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో సర్పంచుల ఫోరం మండలాధ్యక్షులు ఏకార్‌పాషా వెంటనే స్పందించి రక్తదానాన్ని అందించారు. అత్యవసర సమయంలో రక్త దానాన్ని ఇచ్చి ప్రాణాల్ని కాపాడిన సర్పంచును మండల ప్రజలు అభినందించారు.

ప్రభుత్వ స్కూళ్లల్లోనే నాణ్యమైన విద్య

- బడీడు పిల్లలను బడికి పంపాలి
- పలు చోట్ల కొనసాగుతున్న సర్వే
- స్కూల్ మానేసిన వారిని గుర్తించి తిరిగి చేర్పింత

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యా బోధన విద్యార్థులకు అందుతుందని కాచాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసచారి తెలిపారు. బుధవారం గ్రామంలో బడిబయట చదువుకోకుండా పనుల నిర్వహిస్తున్న విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించి పాఠ్యపుస్తకాలను, దుస్తులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుకునే వయసులో పిల్లలను చదువుకోనివ్వాలని, బడికి పంపించకుండా వారితో పనులు చేయించొద్దని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శైలజ, చంద్ర లీల, శ్రీనివాస్, రామకృష్ణ, సిఆర్పి ఈశ్వర్, కంప్యూటర్ ఆపరేటర్ సంపత్, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూర్ మండలం కాచాపూర్



ఎల్లారెడ్డి : మీసానిపల్లిలో..



లింగంపేట్ మండలంలో..



గాంధారి మండలం చద్మల్‌తండాలో..

బడీడు పిల్లల కోసం సర్వే.. ఇటుకబట్టీల వద్ద గుర్తింపు

ఎల్లారెడ్డి : బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్చాలి సిఆర్‌పి మహేష్ అన్నారు. మండలంలోని మీసానిపల్లి గ్రామ ఆవాస ప్రాంత పరిధిలో బుధవారం ఇటుక బట్టీల వద్ద ఇద్దరు బడి బయట పిల్లలను గుర్తించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులతో మాట్లాడి బడిలో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆవాస ప్రాంత ఉపాధ్యాయురాలు హరిత పాల్గొన్నారు.

బడిబయటి పిల్లల కోసం సర్వే

గాంధారి : గాంధారి మండలంలోని చద్మల్ తాండా లో బడి బయట పిల్లల కోసం సర్వే చేపట్టినట్టు రిసోర్స్ టీచర్ పెంటయ్య, సాయన్నలు తెలిపారు. ఈ సర్వేలో ఏయన్‌యం నిర్మల, సావిత్రి, ఆశా వర్కర్లు అమిన, సావత్రిలు తదితరులు పాల్గొన్నారు.

బడి బయట పిల్లలను బడిలో చేర్పింత

రామారెడ్డి : బాడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలనే ఉద్దేశంలో సర్వే చేపట్టినట్టు సిఆర్పి మహమ్మద్ తెలిపారు. మండలంలోని రంగంపేట్‌లో పాఠశాల హెచ్ఎం ప్రభుదేవ సహకారంతో బడీడు పిల్లలను స్కూళ్లో చేర్పించినట్టు తెలిపారు.

నలుగురు విద్యార్థుల గుర్తింపు

లింగంపేట్ : లింగంపేట్ మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం బడి బయట పిల్లల సర్వే నిర్వహించగా.. నలుగురు విద్యార్థులను గుర్తించి బడిలో చేర్పించినట్టు సజ్జన పల్లిపాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదర్ తెలిపారు. ప్రాథమికోన్నత పాఠశాల సజ్జన్ పల్లి, ప్రాథమిక పాఠశాల, ఎక్కపల్లి, ప్రాథమిక పాఠశాల ఎక్కపల్లి తండా పరిధిలో శెట్పల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల నోడల్ అధికారి సాయన్న ఆధ్వర్యంలో ఒ.ఎస్.సి(బడి బయట పిల్లలు) సర్వే నిర్వహించారు.

ఈ సందర్భంగా సాయన్న ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దామోదర్, రమేష్, కార్తీక్ ఉపాధ్యాయులు పద్మ రాకేష్, క్లస్టర్ రీసోర్స్ పర్సన్ రాజు సజ్జన్ పల్లి, ఎక్కపల్లి, ఎక్కపల్లి తండా, పర్మల్ల తండా గ్రామాలకు వెళ్ళి బడికి చాలా రోజులు నుండి రాకుండా ఉన్న 8వ తరగతి ప్రసాద్, చిట్టిబాయ్, రాకేష్ మరియు 5వ తరగతి మనూష లను గుర్తించి వారికి, వాళ్ళ తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి బడిలో చేర్పించారు.

యువత క్రీడల పట్ల ఆసక్తి కనబర్చాలి

- డీఎస్పీ జగన్నాథ్ రెడ్డి

నవతెలంగాణ-పిట్లం

యువత క్రీడల పట్ల ఆసక్తి కనబరచాలని బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బ్రహ్మంగారి గుడి ముందర జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలలో భాగంగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ పోటీలలో మండల ప్రెస్‌క్లబ్, పోలీస్ శాఖలతో పాటు, జూనియర్ కాలేజీ, 11 స్టార్, యన్‌సీసీ, యంసీసీ టీంలు పాల్గొన్నాయి.

ముందుగా ప్రెస్‌క్లబ్ వర్సెస్ పోలీస్ టీంలు తలపడగా.. నిర్ణీత 8 ఓవర్‌లలో ప్రెస్‌క్లబ్ టీం 80 పరుగులు చేయగా.. పోలీస్ టీం బరిలో దిగిన పోలీస్ శాఖ లాస్ట్ ఓవర్‌లో ఆరు బాళ్లకు 11 రన్స్ చేయాల్సి ఉండడంతో డిఎస్పీతో పాటు పోలీస్ శాఖలో ఉత్కంఠ నెలకొంది. అయినప్పటికీ చివరకు కేవలం 5 రన్స్ చేసి ఆల్ అవుట్ అయ్యారు. అనంతరం ప్రెస్ వర్సెస్ 11 స్టార్ తలపడగా 11 స్టార్ విజేతగా నిలిచింది. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ గా రాజు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా ధర్మా అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ విజయ శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ ఇబ్రహీం, క్రీడాకారులు, అధ్యాపకులు, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ సిబ్బందితో డీఎస్పీ కరచలనం

ఒడ్డె ఓబన్న జయంతి వేడుకలు

నవతెలంగాణ-భిక్కనూర్/సదాశివనగర్

స్వాతంత్ర సమరయోధుడు ఒడ్డె ఓబన్న జయంతి వేడుకలను మండలంలోని రామేశ్వర్ పల్లిలో బుధవారం గ్రామ వడ్డెర సంఘం ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కాగా గ్రామంలో తన సొంత ఖర్చుతో వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయించిన డిసిసి ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్ రెడ్డిని గ్రామ వడ్డెర సంఘ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మద్ది చంద్రకాంత్ రెడ్డి, డిసిసిబి మాజీ చైర్మన్ ఎడ్ల రాజిరెడ్డి, సంఘ గ్రామ అధ్యక్షుడు వల్లెపు మల్లేశం, సంఘ నాయకులు వడ్డే రాజు, శంకరయ్య, గంగాధర్, మధుసూదన్, వెంకట్ మహేష్, శశి కుమార్, ఆనంద్, సంతోష్ కుమార్, శ్రీనివాస్, వినోద్ కుమార్, రాజు, పెద్ద సంఖ్యలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : సదాశివనగర్ మండలంలోని పద్మజి వాడి ఎక్స్ రోడ్ లో వడ్డెర ఓబన్న 216వ జయంతి వేడుకలను వడ్డెర సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ర్యాపని సహేందర్, ఉపాధ్యక్షులు ఓర్సు నాగయ్య, మండల ప్రధాన కార్యదర్శి పెనుగొండ రాములు, కార్యదర్శి ఓర్సు రమేష్, కోశాధికారి పిట్ల రాజు సలహాదారులు ఓర్సు పోశయ్య, వల్లపు రాజయ్య, డైరెక్టర్లు ఓర్సు వెంకయ్య సంపంగి బాలయ్య ,ఓర్సు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూర్ మండలం రామేశ్వర్‌పల్లిలో..

మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ

నవతెలంగాణ-భీంగల్

హరితహరంలో నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని పల్లికొండ, చేంగల్, బడాభీంగల్ గ్రామాలలోని మన ఊరు మనబడి పనులను పరిశీలించారు. అనంతరం పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యాదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, అలాగే ఎండిన మొక్కల స్థానంలో మళ్ళీ మొక్కలను నాటి ట్యాంకర్ల ద్వారా నీటిని ప్రతినిత్యం పోయాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో గంగమోహన్, ఏపీవో నర్సయ్య, కార్యదర్శులు తదితరులున్నారు.

ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ వద్దు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఆరోగ్యమే మహాభాగ్యమని.. ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చేయవద్దని ప్రముఖ గైనకాలజిస్ట్ వైద్యురాలు అంకం భానుప్రియ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్, లయన్స్ క్లబ్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని కొరట్‌పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరోగ్యం పై అవగాహనా సదస్సు నిర్వహించారు. మహిళల్లో రక్తహీనత సమస్య తీవ్రంగా వేధిస్తుందని, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్, లయన్స్ రీజియన్ చైర్మెన్ ఉండవల్లి శివాజీ, కార్యదర్శి పి.లక్ష్మినారాయణ, ఏరియా కోఆర్డినేటర్ ద్వారకాదాస్ అగర్వాల్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ అధ్యక్షుడు కె.రమేష్, కోశాధికారి చింతల గంగాదాస్, లయన్స్ క్లబ్ ఆఫ్ తెలంగాణ కార్యదర్శి దర్మేందర్ పటేల్, ప్రోగ్రామ్ చైర్మెన్ ఎం.ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-ఏర్గట్ల



ఆర్థిక సాయం అందజేత

మండలంలోని తడపాకల్ గ్రామానికి చెందిన ఆరే లక్ష్మీకి చెందిన నివాసపు ఇల్లు షాట్ సర్క్యూట్‌తో దగ్ధమవడంతో ఆ కుటుంబానికి నిలువ నీడ లేకపోవడంతో స్థానిక బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబానికి రూ.15వేల ఆర్థికసాయం బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రమాదం జరిగిన రోజున ఇంటి నష్టాన్ని గురించి అంచనా వేయవలసిందిగా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఎమ్మార్వో జనార్దన్‌కు ఆదేశాలు జారీ చేశారని,ఆ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటానని మంత్రి భరోసా కల్పించినట్టు తెలిపారు. స్థానికుడు అయిండ్ల శ్రీనివాస్ కూడా తనవంతుగా రూ.5వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పూర్ణానందం, సర్పంచ్ పత్తిరెడ్డి ప్రకాష్, ఉపసర్పంచ్ లోలం అశోక్, పీఏసీఎస్ చైర్మన్ పెద్దకాపుల శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అష్రాఫ్, కార్యకర్తలు అంజమల్లు, కొండూర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి స్థల మంజూరుకు వినతి

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లా దేవాంగ సంఘం సభ్యులు హైదరాబాద్‌లో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని బుధవారం కలిశారు. జిల్లా దేవాంగ సంఘ భవన నిర్మాణానికి రూ.30 లక్షల నిధులను మంజూరు చేస్తూ ప్రొసిడింగ్ కాపీని ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా దేవాంగ సంఘం సభ్యులు ఎమ్మెల్యేకు శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పట్టణంలో శుక్రవారం దేవి మందిర నిర్మాణానికి 2000 గజముల స్థలం మంజూరు చేయాలని ఎమ్మెల్యేను పట్టణ దేవాంగ సభ్యులు కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు దుగ్గి లక్ష్మణ్, మున్సిపల్ చైర్మన్ భర్త పండిత్ పవన్, కౌన్సిలర్ లిక్కి శంకర్, బీఆర్ఎస్ నాయకులు ఖాందేష్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కొంగి సదాశివ్, పట్టణ దేవాంగ సంఘం అధ్యక్షులు బొప్పెన ప్రసాద్, కొయ్యల రఘు, కొంగిమనోహర్, జీడీ రాజన్న, గంజి రాజన్న, బాపూరావు, గుండెం రవి, గుండెం రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను గుర్తించి పరిష్కారం చూపడంలో మీడియా పాత్రం కీలకం

- నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే జాజాల సురేందర్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరింపజేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. నవతెలంగాణ క్యాలెండర్‌ను బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జాజల సురేందర్ మాట్లాడుతూ పత్రికలు నిజాన్ని నిర్భయంగా రాయాలని అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పత్రికలు విలువైన సమాచారం ప్రజలకు చేరటంలో ఎంతో కీలక పాత్రను పోషిస్తున్నాయని అనంతరం మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణకు నవతెలంగాణ క్యాలెండర్ ను అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలెందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అధిములం సతీష్, నాయకులు రాజు, నవతెలంగాణ విలేకరి సంతోష్ పాల్గొన్నారు.

జుక్కల్ ఎస్సైగా మురళి

నవతెలంగాణ-జుక్కల్



మురళి

జుక్కల్ ఎస్ఐగా బి.మురళి బుధువారం బాధ్యతలు స్వీకరించారు. మెదక్‌జిల్లా ఘన్‌పూర్ నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జుక్కల్ మండలంలో శాంతిభద్రతలను కాపాడుతానని, పేకాట, మట్కా, గుట్కా, అక్రమ ఇసుక, సైబర్ నేరాల అదుపు, అసాంఘిక కార్యకలాపాలను కొనసాగించే వారిపైన ఎంతటి వారైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బదిలీపై వెళ్తున్న ఎస్ఐకి సన్మానం

కామారెడ్డికి బదిలీపై వెళ్తున్న ఎస్సై బాల్‌రెడ్డిని పోలీస్ స్టేషన్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. మండలంలో శాంతిభద్రతు కాపాడి, నేరాల కట్టడికి కృషి చేశారని, దీంతో కలెక్టర్, ఎస్పీ నుంచి గుర్తింపు వచ్చినట్టు గుర్తుచేశారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక

నవతెలంగాణ-తాడ్వాయి



నిర్మల్‌లో జరుగుతున్న రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఇన్‌స్పైర్‌కు కామారెడ్డి వాసవి పబ్లిక్ స్కూల్ లో 10వ తరగతి చదువుతున్న ఎం.డి. పర్వేజ్ ఎంపికయ్యారు. పర్యవేక్షణ ఉపాధ్యాయుడు కమ్మరి రాజుతో కలిసి డ్రయినేజీ వ్యవస్థ ఆధునీకరణ, వాటి ఉపయోగాలపై ప్రయోగం చేసినట్టు తెలిపారు.

మొరం తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



పట్టుబడ్డ ట్రాక్టర్‌లు

రాత్రి వేళల్లో అక్రమంగా మొరం తరలిస్తున్న 3 ట్రాక్టర్‌లను పట్టుకున్నట్టు ఎస్ఐ గణేశ్ తెలిపారు. మంగళవారం రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో మొరం అక్రమంగా తరలిస్తుండగా మూడు ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్టు తెలిపారు. అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు చేపట్టినా, తరలించినా వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఉల్లికోడు తెగులు నుంచి వరి పంటను కాపాడుకోవాలి



- మండల వ్యవసాయ విస్తరణ అధికారి నగేష్‌రెడ్డి

నవతెలంగాణ-వర్ని

వర్ని, కోటగిరి, రుద్రూర్, మోస్రా మండల ప్రాంతాల్లోని రైతులు పంట సాగులో గంగాకావేరి పంటను సాగు చేస్తున్నారని, జిల్లా వ్యాప్తంగా ఇదే పంటను సాగు చేయడంతో పాటు వాతావరణంలో మార్పులు రావడంతో ఉల్లి కోడు, గొట్టపు రంగు తెగుళ్ళ పంటకు సోకినట్టు మండల వ్యవసాయ విస్తరణ అధికారి నగేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం వర్ని మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలోని రైతుల పంటలను పరిశీలించగా ఉల్లికోడు, గొట్టపు రంగు తెగుళ్ల సోకినట్టు గుర్తించారు.

వివేకానంద జయంతి వేడుకల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలి

నవతెలంగాణ-ముప్కాల్

జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని యువజన సంఘం నాయకులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో ప్రోగ్రాం ప్రారంభమవుతుందని అన్నారు. కార్యక్రమంలో భాగంగా యువకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని యువజన సంఘం నాయకులు అవాల శ్రీధర్, గోపి రాము, షబ్బీర్, ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పల్లికొండ గోపీనాథ్ ఈ సందర్భంగా కోరారు.

ఆయిల్‌ఫామ్ సాగుతో లాభాలు

- సూచించిన వ్యవసాయాధికారులు
- పలు గ్రామాల్లో సాగువిధానంపై క్షేత్రస్థాయిలో అవగాహన

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఆయిల్‌ఫామ్ సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని వ్యవసాయాధికారులు సూచించారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో ఆయిల్‌ఫామ్ పంట సాగువిధానంపై అవగాహన కల్పించారు. పలువురు రైతులు సాగుచేసే ఆయిల్ ఫామ్ పంటను పరిశీలించారు.



భీంగల్ : మాట్లాడుతున్న ఏడీఏ



ఆర్మూర్ : చేపూర్‌లో..

డిచ్‌పల్లి : ఇందల్‌వాయి మండలంలోని గన్నారం, డిచ్‌పల్లి మండలంలోని ముల్లంగి గ్రామాలలో ఆయిల్ ఫామ్ పంట సాగు విధానాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారులు ప్రవీన్‌కుమార్, రాంబాబు సందర్శించారు. పంట సాగు విధానం, సబ్సిడీ వివరాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓలు ప్రకాష్ గౌడ్, శ్రీహరి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు మోహన్ నాయక్, ఎంపీటీసీ చింతల దాస్, రైతులు వెంకట్ రెడ్డి, సంతోష్ రెడ్డి, ప్రశాంత్, పవన్ రైతులు పాల్గొన్నారు.

ఎడపల్లి : ఆయిల్‌ఫామ్ పంటపై రైతులు ప్రత్యేక దృష్టి సారిస్తే అధిక దిగుబడులు సాధించి లబ్దిపొందుతారని ఎడపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ది రామేశ్వరరావు అన్నారు. మండలంలోని జైతాపూర్ గ్రామంలో క్షేత్ర సందర్శన చేయించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండెంగల శ్రీనివాస్, సర్పంచ్ శ్రీలక్ష్మీ రాంగోపాల్‌రెడ్డి, జాన్కంపేట్ సొసైటీ చైర్మన్ మిద్దె నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : రైతులు ఆయిల్‌ఫామ్ సాగుపై దృష్టి పెట్టి లాభాలు గడించాలని వ్యవసాయ సంచాలకులు విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని చేపూర్ గ్రామ నర్సరీని సందర్శించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ, సర్పంచ్ ఇందూరు సాయన్న, ఉప సర్పంచ్ శ్రీనివాస్, గ్రామ కోఆర్డినేటర్ గంగారెడ్డి, రాజు, ఏఈఓలు శరత్చంద్ర, నరేష్, వసుధం, రమ్య, వసంత లక్ష్మి రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై ఆయిల్‌ఫామ్ మొక్కలు..

భీంగల్ : ప్రభుత్వం రాయితీపై ఆయిల్‌ఫామ్ మొక్కలను అందజేస్తుందని ఏడీఏ మల్లయ్య తెలిపారు. మండలంలోని చేంగల్ గ్రామంలో రైతువేదికలో రైతులకు ఆయిల్‌ఫామ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో సాయికృష్ణ, ఉద్యావన శాఖ అధికారి సుమన్, సర్పంచ్ చిన్నారెడ్డి, రైతుబంధు గ్రామ కోఆర్డినేటర్, మోహన్, సికింద్రాపూర్ గ్రామ రైతుబంధు కోఆర్డినేటర్ లింబన్న, ఎంపీటీసీ గజేంధర్‌గౌడ్, ఏఈవోలు అరవింద్, మౌనిక, లక్‌పతి, అరుణ, బార్గవ్ రైతులు పాల్గొన్నారు.

నందిపేట్ : ఆయిల్‌ఫామ్ సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారిని జోస్నా భవాని అన్నారు. బుధవారం వన్నెల్ కే గ్రామంలో ఆయిల్‌ఫామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ పంట సాగుకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, లాభాలను ఆమె రైతులకు వివరించారు. అంతర్ పంట సాగుకు నేరుగా సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుందన్నారు. డిస్ట్రిక్ హార్టికల్చర్ అండ్ సెక్యులర్ ఆఫీసర్ పేరట డీడీ తీయవలసి ఉంటుందన్నారు. తక్కువ పెట్టుబడితో సుమారు ఎకరానికి 10 టన్నుల దిగుబడి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సంతోష్‌రెడ్డి, కుద్వాన్‌పూర్ సొసైటీ చైర్మన్ కార్తీక్‌రెడ్డి, సర్పంచ్ కాటిపల్లి లలిత కృష్ణరెడ్డి, వ్యవసాయ విస్తీర్ణాధికారి గంగాధర్ రైతులు పాల్గొన్నారు.

పద్మశాలి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఈనెల 14న మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పద్మశాలి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు చింత తిరుపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని పద్మశాలి విజయ సంఘం కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటలకు మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టి.ఎస్.పి.ఎస్.సి సిలబస్ కమిటీ సభ్యుడు, ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింత గణేష్, హైదరాబాదులోని ఆర్‌సీ రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఫ్యాకల్టీ మెంబెర్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ చింత మోహన్ హాజరవుతున్నట్టు తెలిపారు. ప్రతిభ పురస్కారాల కోసం ఇప్పటికే ఆయా గ్రామాల నుంచి పదవ తరగతి నుంచి ఎంబీబీఎస్ వరకు ఉత్తమ గ్రేడ్లు, మార్కులు, సీట్లు సాధించిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించినట్టు తెలిపారు. కార్యక్రమానికి కమ్మర్‌పల్లి మండల పద్మశాలి బాంధవులందరూ ప్రతి గ్రామం నుంచి ముఖ్యంగా విద్యార్థులు తప్పకుండా హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమానికి హాజరయ్యే కుల బంధువుల కోసం మధ్యాహ్నం భోజన వసతి ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

24వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

నవతెలంగాణ-బోధన్

బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని కోరుతూ బోధన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 24వ రోజు కొనసాగాయి. దీక్షలలో సీపీఐ నాయకులు షేక్ బాబు, మన్నన్, ఖదీర్ బేగ్, గౌస్ పాల్గొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సి.హెచ్.వి.హన్మంతరావు, శేఖర్, గంగారెడ్డి, శంకర్, బాణోత్ రమేష్, ధర్మయ్యనాయక్, సాయిలు, కోటేశ్వరరావు, ఈశ్వర్, దత్తాత్రేయ కులకర్ణి, కేశవ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న 216వ జయంతి



మాక్లూర్ : జెండావిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్/మాక్లూర్/నవీపేట్

తెలంగాణ వడ్డెర జేఏసీ డివిజన్ యువసేన అధ్యక్షులు మక్కల సాయినాథ్ అధ్యక్షతన వడ్డె ఓబన్న 216వ జయంతి వేడుకలను బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా బయలుదేరి వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ వడ్డెర జేఏసీ కన్వీనర్ దండి వెంకట్, జిల్లా ఉపాధ్యక్షులు ద్యారంగుల రాజు, జిల్లా నాయకులు పల్లపు మోహన్, డివిజన్ నాయకులు గండి కోట రాజన్న తదితరులు పాల్గొన్నారు

మాక్లూర్ : మండలంలోని మామిడిపల్లి, దాస్‌నగర్ సమీపంలో వడ్డే ఓబన్న 216వ జయంతి సందర్భంగా మండల వడ్డెర సంఘం ఆధ్వర్యంలో జెండాను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇడగొట్టి సాయిలు, బండారి ఎల్లయ్య, యాత్తర్ చందర్, జి.పాపన్న, యాత్తర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట్: మండల కేంద్రంలో 216వ వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా వడ్డెర సంఘం ఆధ్వర్యంలో మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు సాయిలు మాట్లాడుతూ వడ్డే ఓబన్న ఆశయాల సాధనలో వడ్డెర కులస్తులు ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సత్యనారాయణ, వడ్డెన్న, మైసయ్య గుంజ సంతోష్, సంజీవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిలు, కృష్ణ, బాబు, అశోక్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సలహాలు ఇవ్వాలి

వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ రవీందర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

వివిధ విభాగాలలో అభివృద్ధికి తమవంతు సలహాలు, సూచనలు ఇవ్వాలని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రవీందర్ అన్నారు. అధ్యాపకులు స్పందిస్తూ కంప్యూటర్‌లు కావాలని, సోషల్ సైన్స్ భవనం, హ్యూమానిటీ భవన్ నిర్మాణం జరిగే విధంగా చుడాలని వైస్ ఛాన్సలర్‌కు విన్నవించారు. బుధవారం తెలంగాణ యూనివర్సిటీలో వీసీ ఎక్సిక్యూటివ్ హాల్, పరిపాలన భవనంలో తెలంగాణ యూనివర్సిటీ రెగ్యులర్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ డి.రవీందర్ అధ్యాపకులను యూనివర్సిటీ అభివృద్ధికి తమ వంతు కృషిచేయాలని తెలిపారు. సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ విద్యావర్ధిని, యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పలువురిని అభినందించిన వీసీ..

'ఇండియన్ ప్రెసిడెన్స్ అఫ్ జీ 20'లో భాగంగా విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందించడానికి 'ఒక భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు, అనే విషయంపై గవర్నర్ డాక్టర్ తమిళ్ సై సౌందర రాజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందీ ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న తెలంగాణ యూనివర్సిటీ ఎంఏ హిందీ నవనీత్, ఎస్.బ్రహ్మానందం, తెలుగు ఉపన్యాస పోటీలలో పాల్గొన్న ఎర్రం సురేష్‌ను వైస్ ఛాన్సలర్ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ విద్యావర్ధిని బుధవారం అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జమీల్ అహ్మద్, డాక్టర్ పార్వతి, డాక్టర్ ప్రవీన బాయి, డాక్టర్ శ్రావంతి ఉన్నారు.

ఐటీ హబ్ పనులను పరిశీలించిన అర్బన్, రూరల్ ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కలిసి బుధవారం ఐటీ హబ్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ సాంబరి మోహన్, జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు

మధ్య తరగతి నుంచి చార్టర్ అకౌంటెంట్ వరకు..

- క్షత్రియ విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్





అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ఘటడి యోగేష్, కములు శ్రీనివాస్ చదువులో ప్రతిభ కనబరిచి చార్టర్ అకౌంటెంట్స్‌లో ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులై కన్న తల్లిదండ్రుల, చదువు చెప్పిన గురువులను గర్వంతో ఉప్పొంగేలా చేశారు. వివరాలిలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన క్షత్రియ ఖత్రి కులానికి చెందిన ఘటడి సుభాష్, రమీల దంపతుల కుమారుడు ఘటడి యోగేష్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రామ్ మందిర్ స్కూల్లో పదవ తరగతి వరకూ విజయ్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివి తనకు ఇష్టమైన అకౌంట్స్ విషయంలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా హైదరాబాద్‌లో చదివి అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. అలాగే పట్టణానికి చెందిన క్షత్రియ ఖత్రి కులానికి చెందిన కములు గంగాధర్ ఆర్టీసీ కంట్రోలర్, సుజాత దంపతుల కుమారుడైన కములు శ్రీనివాస్ ప్రజ్ఞ హైస్కూల్ పదవ తరగతి వరకు చదివి, విజయ్ జూనియర్ కాలేజ్‌లోనే ఇంటర్మీడియట్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియాలో చార్టెడ్ అకౌంటెంట్‌గా అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించి గర్వ కారణంగా నిలిచారు. దృఢ సంకల్పం..

పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలమని నిరూపించిన ఘటడి యోగేష్, కములు శ్రీనివాస్‌ను పట్టణ వాసులు శుభాకాంక్షలు తెలిపి భవిష్యత్తులో మరెన్నో ఘనతలు సాధించాలని కోరారు. ఈ సందర్భంగా క్షత్రియ, విజయ్, ప్రజ్ఞ విద్యాసంస్థల యాజమాన్యాలు అల్జాపూర్ శ్రీనివాస్, దేవేందర్, ప్రజ్ఞ వంశీ, రోమా వంశీ, క్షత్రియ సమాజ్ నాయకులు తదితరులు అభినందించారు.

అలరించిన రంగ వల్లులు

నవతెలంగాణ-బోధన్

సంక్రాంతి పండగను పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని పలు వార్డులలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ సతీమణి ఆయేషా ఫాతిమా మహిళలు వేసిన రంగవల్లులను ఆసక్తిగా తిలకించారు. అనంతరం పోటీలలో పాల్గొన్న విజేతలకు ఆమె బహుమతులు అందించారు. కార్యక్రమంలో సునీత దేశాయ్, కౌన్సిలర్ ధూప్ సింగ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాధాకృష్ణ, పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జెసి) రాకాసిపేటలో ఉపాధ్యాయులు విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. విద్యార్థులు రంగురంగుల ముగ్గులు వేయడంతో పాఠశాల ప్రాంగణం రంగులతో ఆకట్టుకుంది. సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ఈ ముగ్గుల పోటీలో విజేతలైన విద్యార్థులకు హెచ్ఎం రాజేశ్వర్ శర్మ బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మావతి, మైత్రేయి, రాజేశ్వర్, ఈశ్వర్, నగేష్‌బాబు, పద్మజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఇందూర్ బీఎడ్ కళాశాలలో ముగ్గుల పోటీలు

బోధన్ పట్టణం ఆచన్‌పల్లిలోని ఇందూర్ బి.ఎడ్ కళాశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఛాత్రోపాధ్యాయులకు ముగ్గుల పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛాత్రోపాధ్యాయులు రంగురంగుల రంగవల్లులు వేయడంతో కళాశాల ప్రాంగణం రంగులమయం అయింది. ఈ సందర్భంగా ఇందూర్ బీఎడ్ కళాశాల డైరెక్టర్ థామసయ్య మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ఛాత్రోపాధ్యాయులకు నిర్వహించిన ముగ్గుల పోటీలు అందరిని ఆకట్టుకున్నాయని అన్నారు. అనంతరం ఆయన కళాశాల అధ్యాపకులకు, ఛాత్రోపాధ్యాయులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అప్పలనాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఇందూర్ బీఎడ్ కళాశాలలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ఛాత్రోపాధ్యాయులు

శావులం సాయిలు అందరివాడు

- అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి/రెంజల్

కామ్రేడ్ శావులం సాయిలు అందరివాడని ఆయన లేని లోటు తీరనిదని అఖిలభారత, ప్రజాతంత్ర, ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామంలో కామ్రేడ్ దివంగత శావులం సాయిలు 27వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు గుమ్ముల గంగాధర్ మాట్లాడారు. కార్యక్రమంలో కె.రవి, శ్రీపతి మల్లేష్, సుదర్శన్, హనుమాన్లు, భూమయ్య, రెంజల్ చిన్న పోశెట్టి, లక్ష్మణ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : భూ పోరాటంలో అనేకమంది పేద రైతులకు భూములు ఇప్పించిన ఘనత శావులం సాయిలుకే దక్కిందని అఖిలభారత రైతు సంఘం నాయకులు స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో సాయిలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయిలు 27వ వర్ధంతిని పురస్కరించుకొని పలువురు వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రగతిశీల రైతు సంఘం మండల అధ్యక్షులు వడ్డెన్న, కార్యదర్శి ఎస్కే నశీర్, ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర నాయకులు పార్వతీ రాజేశ్వర్, మండల ఉపాధ్యక్షులు పెద్దలు, స్థానిక నాయకులు ఎల్.గంగాధర్, సిద్ద పోశెట్టి, హమీద్, జబ్బార్, పోశెట్టి, సాకలి సాయిలు, బొంబాయి పోశెట్టి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్'ను సందర్శించిన విద్యార్థులు

నవతెలంగాణ-ముప్కాల్/ఆర్మూర్

ముప్కాల్ మండల కేంద్రంలోని న్యూ హరిజోన్స్ పాఠశాల విద్యార్థులు బుధవారం ఉదయం నిర్మల్ జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నిర్వహిస్తున్న 'రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్' కార్యక్రమంలో పాల్గొన్నారని పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రవిలాస్ తెలిపారు. సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో భాగంగా ఆయా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన పలు రకాల విభాగాలపై విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో ఉన్న కొయ్యబొమ్మల పారిశ్రామిక సహకార సంఘంను సైతం సందర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రవిలాస్, కరస్పాండెంట్ రత్నాకర్, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ముప్కాల్ : సైన్స్‌ఫెయిర్‌లో న్యూహరిజోన్స్ విద్యార్థులు

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను సందర్శించిన లిల్లీపుట్ విద్యార్థులు..

ఆర్మూర్ : నిర్మల్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను లిల్లీపుట్ విద్యార్థులు బుధవారం సందర్శించారు. ఈ ప్రదర్శనలో ముఖ్యంగా సోలార్ పవర్, రాకెట్ లాంచింగ్, ఎలక్ట్రికల్ పవర్, వాటర్ ప్యూరిఫికేషన్ వర్కింగ్ మోడల్, ఆక్సిజన్ బాక్స్, ఆర్గానిక్ ఫుడ్, డ్రింక్ అండ్ డ్రైవ్ వంటి కొత్తకొత్త ప్రయోగాలను చూశారు. ఈ సందర్భంగా కరస్పాండెట్ రామకృష్ణ మాట్లాడుతూ.. ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శన తిలకించడం వలన విద్యార్థులలో ఉన్న మేధో శక్తిని వెలికితీసేందుకు మంచి అవకాశం అన్నారు. తమ విద్యార్థులు కూడా గొప్ప గొప్ప శాస్త్రవేత్తలు కావాలని ఆయన పేర్కొన్నారు.

మృదుపాణిని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలి

- జీజేసీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవి

నవతెలంగాణ-భీంగల్

ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీస్‌లో ఆలిండియా 21వ ర్యాంక్ సాధించిన చేంగల్ గ్రామానికి చెందిన నంబి మృదుపాణిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు చదువులో ముందుకు వెళ్లాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అబ్బ చిరంజీవి అన్నారు. చేంగల్ గ్రామానికి చెందిన నంబి శ్రీనివాస్, శ్రావణిల కూతురు నంబి మృదుపాణి ఇటీవల ఐఈసీలో 21వ ర్యాంకు సాధించడంతో బుధవారం న్యూ ఫ్రెండ్స్‌యూత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. దేశం నలుమూలల భీంగల్, చేంగల్ ఖ్యాతిని చాటి చెప్పిన మృదుపాణిని ఆదర్శంగా తీసుకోని చదువులో ముందుకు వెళ్లాలని అప్పుడే కన్న తల్లిదండ్రులకు, చదువు చెప్పిన గురువులకు మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు రావుట్ల అరవింద్, సభ్యులు అరవింద్, లడ్డు, నేత, నాగేష్, బాలు, నవీన్, రాము, శివ, నాగరాజు, హరీష్, మోహన్, లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

వాగుపై వంతెన నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-వర్ని

తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన హామీమేరకు రూ.1.80 లక్షల రూపాయల నిధులతో వాగుపై వంతెన నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్టు టీఆర్ఎస్ పార్టీ యువనేత పోచారం సురేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం చందూర్ మండలంలోని కారేగాం తండాలో పెద్దవాగు వద్ద అటుగా కింది భాగంలో ఉన్న రైతులు రాకపోకలకు వంతెన నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్ల నుంచి ఇబ్బందులు పడుతున్న కారేగాం తండా రైతుల కలను తమ నాయకుడు పోచారం సురేందర్ రెడ్డి నెరవేర్చినాడని అన్నారు. రైతులు వర్షాకాలం వస్తే తమ పంటచేలకు పోయినవారు తిరిగిరాని పరిస్థితి ఉండేదని అలాంటి దుస్థితి లేకుండా రైతులు రాకపోకలకు వంతెన నిర్మాణం చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఇందుకు గ్రామ ప్రజలు, రైతులు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవి సింగ్, ఉమ్మడి మండల ఏఎంసీ చైర్మన్ మూడు కవిత అంబర్ సింగ్, సర్పంచులు సాయిరెడ్డి, సత్యనారాయణ, రవి, చందూర్ పీఏసీఎస్ చైర్మన్ మాధవరెడ్డి, ప్యారం అశోక్, ఎంపీటీసీ శ్యామ్‌రావు, పలు గ్రామాల అధ్యక్షులు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌కు సన్మానం



చైర్మన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేసీఆర్ కప్ 2023 నిజామాబాద్ పార్లమెంట్ స్థాయి కబడ్డీ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఇ.ఆంజనేయగౌడ్‌ను ఎస్.ఎస్.ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రవీందర్‌గౌడ్, జిల్లా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్, జిల్లా గౌడ సంఘం కోశాధికారి చెరుకుల లక్ష్మణ్‌గౌడ్, గౌడ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఇ.శ్రీనివాస్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర వహించిన విద్యార్థి నాయకుడు, పాలమూరుకు చెందిన వెనుకబడిన వర్గానికి చెందిన వ్యక్తిని చైర్మన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, ఎమ్మెల్సీ కవితకు కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే కాలంలో కేసీఆర్ ఆశీస్సులతో ప్రజాసేవలో మమేకమై ఉజ్వల రాజకీయ భవిష్యత్తు కలిగి ఉండాలని ఆకాంక్షించారు.